క్లుప్తంగా

పాత పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

సాక్షి ఎఫెక్ట్..

కందుకూరు: కందుకూరు చౌరస్తాలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారంటూ ఈ నెల 18న 'గొంతెండుతోంది' శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీఓ సరిత, పంచాయతీ కార్యదర్శి సురేందర్ కందుకూరు గ్రామం నుంచి చౌరస్తా వరకు ఉన్న పాత పైపులైన్‌ను పరిశీలించి లీకేజీలకు సిబ్బందితో మరమ్మతులు ప్రారంభించారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరించి తాగునీరు అందించేలా చూస్తామన్నారు.

హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ వాణి


మున్సిపల్ సిబ్బంది తొలగించిన హోర్డింగ్స్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా హోర్డింగ్స్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి పేర్కొన్నారు. మంగళవారం పుర కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై మున్సిపాలిటీ అనుమతులు లేకుండా అక్రమంగా భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌ను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హైడ్రా జోనల్ ఇన్‌చార్జి బి.సుదర్శన్‌రెడ్డి ఇటీవల తుక్కుగూడలో పర్యటించి వీటిని గుర్తించారన్నారు. హైడ్రా ఆదేశాల మేరకు వీటిని తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లవి స్కూల్‌లో కార్నివాల్


స్టాళ్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: తిరుమలగిరిలోని పల్లవి మోడల్ స్కూల్లో కార్నివాల్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఫుడ్, గేమ్, స్టార్ట్ అఫ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి సందడి చేశారు. విద్యార్థులు సొంతంగా తయారుచేసిన స్టాళ్లను స్కూల్ డైరెక్టర్ డా.ఎస్.కార్తీక్ సందర్శించి అభినందించారు. అలాగే రెట్రో–థీమ్ ర్యాంప్ వాక్ గ్లామర్, స్టైల్ అందరినీ ఆకట్టుకుంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉన్న వంటకాలను విద్యార్థులు అందుబాటులో ఉంచి అలవాట్లు, అభిరుచులు, దేశభాషలు కట్టుబట్లను స్టాళ్లల్లో అందుబాటులో ఉంచారు. కార్నివాల్ అనేది వినోదం, ఆవిష్కరణల సమ్మేళనం అని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మీసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సన్నద్ధం

వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అల్పాహారం


ప్రత్యేక తరగతిలో చదువుతున్న విద్యార్థులు

మీర్‌పేట: పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.. వారాంతంలో ప్రాక్టీస్ టెస్టులు పెడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు.. మీర్‌పేటలోని జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. జిల్లాలోనే అత్యధిక సంఖ్య విద్యార్థులు ఉన్న పాఠశాల కావడంతో పాటు ప్రతి సంవత్సరం 80 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధిస్తుండడంతో ఈ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా మెలకువలు నేర్పిస్తూ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

సులువుగా అర్థమయ్యేలా..

జిల్లెలగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 1151 మంది విద్యార్థులు ఉండగా.. పదో తరగతిలో 227 మంది ఉన్నారు. వీరందరికీ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అదే విధంగా సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కోరోజు ఒక్కో సబ్జెక్టుపై విద్యార్థులకు పాఠాలు చెబుతూ కఠినమైన సబ్జెక్టుల్లోని అంశాలు సులువుగా అర్థమయ్యేలా మెలకువలు నేర్పిస్తూ సాధన చేయిస్తున్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి చదివించడంతో పాటు చురుకుగా ఉన్న వారిని గ్రూపులుగా చేసి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.


విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు

విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా బోధన చేయడంతో పాటు కఠినమైన ప్రశ్నలకు ఎలా సమాధానాలు రాయాలో మెలకువలు నేర్పిస్తున్నారు. పరీక్షలు దగ్గరవుతున్న వేళ ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా ప్రత్యేక తరగతుల సందర్భంగా రోజుకో విధమైన అల్పాహారం అందజేస్తున్నారు.

–కుసుమలత, 10వ తరగతి విద్యార్థిని

మెలకువలు నేర్పిస్తున్నాం



పరీక్షల్లో వచ్చే ముఖ్యమైన చాప్టర్లపై విద్యార్థులతో ప్రతీ రోజు ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ప్రత్యేకంగా నోట్ చేసిన ప్రశ్నపై విద్యార్థులతో చర్చ నిర్వహించి దాన్ని ఎలా సాధన చేయాలో నేర్పిస్తున్నాం. పరీక్షల్లో కఠినంగా వచ్చే ప్రశ్నలను సులువుగా ఎదుర్కొనేలా మెలకువలు నేర్పుతున్నాం.

– నామాల మురళీకాంత్, గణిత ఉపాధ్యాయుడు

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పది పరీక్షల్లో మండలంలో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల్లో మెలకువలు నేర్పిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

– కృష్ణయ్య, మండల విద్యాధికారి


కందుకూరు చౌరస్తాలో భారీ గజమాలతో పాటు పూలతో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కందుకూరు: ఆమనగల్లులో నిర్వహిస్తున్న రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డికి మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీఎత్తున స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించి జేసీబీ యంత్రాలతో గులాబీ పూలను చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కందుకూరు చౌరస్తాతో పాటు దెబ్బడగూడ గేట్ వద్ద పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన వెంట రైతుదీక్షకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, గణేశ్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొంగల చేతివాటం

కందుకూరు చౌరస్తాలో కేటీఆర్‌కు స్వాగతం పలికే పనుల్లో నాయకులు బిజీగా ఉండటంతో ఇదే అదనుగా దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు. మురళీనగర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్ జేబులో నుంచి రూ.25 వేలు తస్కరించారు. దీంతో అతను కార్యక్రమం అయిన తర్వాత చూసుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

తుక్కుగూడ ఔటర్ వద్ద..

తుక్కుగూడ: ఆమనగల్లులో మంగళవారం చేపట్టిన రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తుక్కుగూడ ఔటర్ వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్ రవినాయక్, సుమన్, లావణ్య, నాయకులు తదితరులు ఉన్నారు.


కందుకూరులో ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు, నాయకులు

ఇళ్ల స్థలాల కబ్జా చూపాలంటూ వినతి

కందుకూరు: సర్టిఫికెట్లు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి లబ్ధిదారులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ..కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్ 788లో 183 మంది, 107లో 330 మందికి 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. ఆ సర్టిఫికెట్లకు సంబంధించి కబ్జా చూపాలని ఆందోళనలు చేయడంతో ఈ నెల 6న ఆ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేశారన్నారు. ఇంతవరకు ఎలాంటి లేఅవుట్ వేయలేదన్నారు. పేదలు నివసించేలా రోడ్లు అభివృద్ధి చేసి ప్లాట్లు కేటాయించాలని ఆర్డీఓను కోరామన్నారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చారన్నారు.కార్యక్రమంలో గుడిసెల సంఘం అధ్యక్షుడు రాయికంటి శేఖర్, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకుడు గాదె సత్యం, లబ్ధిదారులు రాములు, యాదయ్య, జంగయ్య, సక్కుబాయి, యాదమ్మ, కవిత, అరుణ,రాములు,గంగమ్మ,అలివేలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని ఎమ్మెల్యే ఎందుకు?

- బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్
- కార్పొరేషన్ ఎదుట నాయకులతో కలిసి ధర్నా


ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ నేత శ్రీరాములుయాదవ్

బడంగ్‌పేట్: నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించని ఎమ్మెల్యే, అధికారులు ఎందుకు అని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మంగళవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు మెరుపు ధర్నా నిర్వహించారు. పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు–1,2 రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ.. చేవెళ్ల సబితమ్మ ఈ ప్రాంతానికి దోచుకోవడానికే వచ్చిందన్నారు. కార్పొరేషన్ ఎదుట ఉన్న శివసాయినగర్ కాలనీలో డ్రైనేజీ అవుట్ లెట్ లేక రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. దోసుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాలనీవాసులు కన్నీళ్లు తుడవడానికి ఎందుకు ముందుకు వస్తలేరని ప్రశ్నించారు. గ్రీన్ బెల్ట్ సమస్య ఎందుకు పరిష్కరింలేదని ప్రశ్నించారు. మహేశ్వరం నియోజకవర్గంతో ఎమ్మెల్యేకు సంబంధం లేదని చేవెళ్లతోనే అనుబంధం ఎక్కువన్నారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాల్లో మునిగారని ధ్వజమెత్తారు. కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని, ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్‌రెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గుర్రం మల్లారెడ్డి, కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పలు కాలనీవాసులు పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య


మాట్లాడుతున్న జంగయ్య

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య అన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావొస్తున్నా ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఇంతవరకు దరఖాస్తుల ప్రక్రియ కూడా పూర్తికాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేదంటే పేదల పక్షాన సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు బాలరాజ్, రత్నయ్య, బాలమ్మ పాల్గొన్నారు.

అమ్మవారికి మారుబోనం సమర్పణ


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ అమ్మవారి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి మారుబోనం సమర్పించారు. ఆలయ ధర్మకర్త విఠల్‌బాబా పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా రాత్రింబవళ్లు కృషి చేసిన కార్మికులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కిశోర్, ప్రవీణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం బోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యా ర్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

వందకోట్లతో అండర్‌పాస్‌ల నిర్మాణం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.100 కోట్లతో షాద్‌నగర్ పరిధిలోని బైపాస్ జాతీయ రహదారిలో మూడుచోట్ల అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ పరిధిలో కొత్తూరు, పెంజర్ల, జేపీ దర్గా, మేకగూడ, చటాన్‌పల్లి, బూర్గుల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు అండర్‌పాస్‌లు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి నేషనల్ హైవే అథారిటీ పీడీని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన ప్రభుత్వాలు జేపీ దర్గా, చటాన్‌పల్లి వద్ద, బూర్గుల గేటు వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒక్కో అండర్‌పాస్ నిర్మాణం సుమారు కిలోమీటర్ మేర నిర్మించనున్నట్లు, ఇందుకు సంబందించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. ఈ నిర్మాణ పనులు మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. అండర్ పాస్‌ల నిర్మాణం పూర్తయితే ప్రయాణం సులభంగా మారుతుందని, ప్రమాదాలు జరిగే అవకాశమే ఉండదన్నారు. అదేవిధంగా రెండో విడతలో కొత్తూరు నుంచి కర్నూల్ వరకు ఉన్న బెంగుళూరు జాతీయ రహదారిని ఆరులేన్లుగా విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని వై ఆకారంలో నిర్మిస్తామని, బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరు చేయాలని సీఎం కోరినట్లు తెలిపారు. త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చొలపల్లి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్(పాలిథిన్) ఉత్పత్తుల నిషేధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. ఇందులో భాగంగా మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు వ్యాపారులు, ప్రజలు పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇళ్లు, ఖాళీ ప్రాంతాల్లో చెత్తను పారబోయకుండా ప్రజలు శుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చిన్న చిన్న ఫంక్షన్ల (శుభకార్యాలు)తో పాటు పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం చాలావరకు పెరిగిందన్నారు. నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తుల కారణంగా పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యాలకు చాలావరకు ముప్పు ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. దీనికితోడు తడి, పొడిచెత్తను వేరుచేసి సిబ్బందికి అందించాలని ప్రజలు, వ్యాపారులను కోరారు. నాణ్యతలేని ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించే వ్యాపారులకు జరిమానాలు విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్ సోమ్లానాయక్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు


పూర్ణాహుతి పూజలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో గత మూడురోజుల పాటు జరిగిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిశాయి. చివరిరోజు ఆలయం వద్ద ఆలయ ధర్మకర్తలు సున్నపు వసంతం, మానిక్యప్రభు, అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో పుణ్యపూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి, భజన కార్యక్రమాలు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి సహకారంతో చేపట్టిన గోశాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.